మహానేతా.. మనసా స్మరామి

బడుగుల బతుకులు బాగు చేయాలని నిరంతరం తపించిన మహానేత వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి వర్ధంతిని నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున నిర్వహించారు. దివంగత నేతకు నివాళులు అర్పించి పేదలకు చీరలు పంపిణీ చేశారు. రాజశేఖర్ రెడ్డి జనరంజక పాలనను గుర్తు చేసుకున్నారు. ఆయన బాట నడవాలని.. అదే ఆయనకు ఘనమైన నివాళి అని నాయకులు సంకల్పించుకున్నారు.

- నియోజకవర్గంలో పలు చోట్ల దివంగత నేత వైఎస్సార్ వర్ధంతి
- ఆయన అందించిన సంక్షేమాన్ని గుర్తు చేసుకున్న ప్రజలు
- మహానేత ఆశయాల కొనసాగింపే ఆయనకు నిజమైన నివాళి అని నాయకుల ఉవాచ



లక్ష్మీ టాకీస్ వద్ద మహా నేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి



వైఎస్సార్‌కు నివాళి అర్పిస్తున్న సీతంరాజు సుధాకర్, నారాయణరావు



ఎండాడలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మహానేతకు నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి



మూడుగుళ్లు జంక్షన్‌లో మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న సీతంరాజు సుధాకర్



41వ వార్డులో మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, శ్రీధర్

వైఎస్సార్ పేరిట ఉచిత కంప్యూటర్, టైలరింగ్ శిక్షణ..



ఉచిత టైలరింగ్ శిక్షణను ప్రారంభిస్తున్న మేరీజోన్స్

దాబాగార్డెన్స్ :జీవీఎంసీ 36వ వార్డులో మహానేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని వైఎస్సార్ పేరిట గొడారి గోతుల్లో చదువుకుంటున్న విద్యార్థుల కోసం ఉచిత కంప్యూటర్ శిక్షణ, మహిళల కోసం ఉచిత టైలరింగ్ శిక్షణను ప్రారంభించారు. వార్డు కార్పొరేటర్ మాసిపోగు మేరీజోన్స్, అధ్యక్షుడు మాసిపోగు రాజు దంపతుల సొంత నిధులతో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కంప్యూటర్ శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని చెప్పారు. మహిళలు సొంతంగా ఎదిగేందుకు కుట్టులో శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు.

దాబాగార్డెన్స్/అల్లిపురం/జగదాంబ/మహారాణిపేట/కంచరపాలెం/సీతమ్మధార : మహానేత, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి 14వ వర్ధంతి కార్యక్రమం శనివారం దక్షిణ నియోజకవర్గ పరిధి పలు వార్డుల్లో నిర్వహించారు. మహానేత విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. పేదలు, వృద్ధులకు పండ్లు పంపిణీ చేసి చీరలు, దుప్పట్లు అందజేశారు. వృద్ధాశ్రమాల్లో ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం అన్నసమారాధనలు నిర్వహించారు. పాపాహోమ్, ప్రేమసమాజంలో పిల్లలకు పండ్లు పంచిపెట్టారు. మధ్యాహ్నం అన్నసమారాధన జరిపారు. ముందుగా ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఎండాడలో నిర్మించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవంలో పాల్గొని మహానేత విగ్రహానికి పలువురు నాయకులతో కలిసి నివాళులర్పించారు. అనంతరం నియోజకవర్గ పరిధి జగదాంబ జంక్షన్ వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి ఆ వార్డు అధ్యక్షుడు పీతల వాసు నేతృత్వంలో నిర్వహించిన సేవా కార్యక్రమంలో పాల్గొని మహిళలకు చీరలు పంపిణీ చేశారు. 34వ వార్డు అచ్చియ్యమ్మపేట జంక్షన్ వద్ద ఆ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి నేతృత్వంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసుపల్లి మాట్లాడుతూ తెలుగు ప్రజల గుండె చప్పుడు, అపర భగీరథుడు, మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డిని కొనియాడారు. కడప లోక్‌సభ నియోజకవర్గం నుంచి 4 సార్లు, పులివెందుల అసెంబ్లీ నియోకవర్గం నుంచి 6 సార్లు విజయం సాధించారన్నారు. 2004–09 వరకు రాష్ట్ర ముఖ్యమంత్రిగా పని చేసిన వైఎస్సార్ తెలుగు ప్రజల జీవితాలపై చెరగని ముద్ర వేశారన్నారు. 2003లో మండు వేసవిలో దాదాపు 1467 కిలోమీటర్ల మేర పాదయాత్ర చేపట్టి అప్పట్లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చారని చెప్పారు. జలయజ్ఞం, ఆరోగ్యశ్రీ, 108, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి కార్యక్రమాలు ప్రజలకు దగ్గరకు చేశాయని తెలిపారు. కార్యక్రమంలో 29వ వార్డు అధ్యక్షుడు పీతల వాసు, పలు వార్డుల కార్పొరేటర్లు కోడూరు అప్పలరత్నం, తోట పద్మావతి, విల్లూరి భాస్కర రావు, వార్డుల అధ్యక్షులు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, జీసీఎస్ ఇన్‌చార్జిలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వైఎస్సార్ అభిమానులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల ప్రదాత..

సంక్షేమ పథకాల ప్రదాత స్వర్గీయ డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి అని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. శనివారం వైఎస్సార్ 14వ వర్ధంతి సందర్భంగా జీవీఎంసీ 35వ వార్డు అధ్యక్షుడు అలపన కనకరెడ్డి ఆధ్వర్యంలో దుర్గాలమ్మ ఆలయం జంక్షన్‌లో వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పేదలకు చీరలు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ వార్డు నాయకులు, కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

33వ వార్డులో..

వార్డు అధ్యక్షుడు రంథి గోపీకృష్ణ ఆధ్వర్యంలో బంగారుమెట్ట శ్రీ రామ ఆంధ్ర యువజన సమాజం వద్ద జరిగిన కార్యక్రమంలో సీతంరాజు సుధాకర్ పాల్గొని వైఎస్సార్‌కు నివాళులు అర్పించారు. అనంతరం వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు.

- మూడుగుళ్ల జంక్షన్‌లో జరిగిన కార్యక్రమంలో సీతంరాజు సుధాకర్ పాల్గొని మహిళలకు చీరలు పంపిణీ చేశారు.

34వ వార్డులో..

అచ్చియ్యమ్మపేట జంక్షన్‌లో గల వై.ఎస్. రాజశేఖర రెడ్డి విగ్రహానికి 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతితో కలసి ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పారిక వరప్రసాద్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు.

35వ వార్డులో..

జీవీఎంసీ 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అన్నదాన కార్యక్రమంలో పాల్గొని పేదలకు అన్నదానం చేశారు. వార్డు నాయకులు మల్లిబాబు, మంగరాజు తదితరులు పాల్గొన్నారు.

39వ వార్డులో..

జీవీఎంసీ 39వ వార్డులో కనకమహాలక్ష్మి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం ఆధ్వర్యంలో వైఎస్సార్ వర్ధంతి నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం పేదలకు చీరలు పంపిణీ చేశారు.

29వ వార్డులో..

జీవీఎంసీ 29వ వార్డు కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ మెంబర్ వురికిటి నారాయణరావు ఆధ్వర్యంలో దివంగత వైఎస్సార్ వర్ధంతి నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు సీతంరాజు సుధాకర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జగదాంబ జంక్షన్‌లోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అమెరికన్ హాస్పిటల్ ఓల్డ్ ఏజ్ హోమ్ వృద్ధులకు పండ్లు పంపిణీ చేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వార్డు సీనియర్ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకులు, ప్రజలు పాల్గొన్నారు

41వ వార్డులో..

జ్ఞానాపురం పోస్టాఫీస్ వీధిలో గల వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ నేతృత్వంలో దివంగత నేత వైఎస్సార్ వర్ధంతి నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్, అర్బన్ క్లస్టర్ ఇన్‌చార్జి కోడిగుడ్ల శ్రీధర్ పాల్గొని రాజశేఖర్‌రెడ్డికి నివాళులు అర్పించారు. సుమారు 500 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, గృహసారథులు, కన్వీనర్లు పాల్గొన్నారు.

వేమన మందిరంలో..

ఆశీలమెట్టలోని వేమన మందిరంలో వేమన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వైఎస్సార్‌కు గౌరవ అధ్యక్షుడు సత్తి నాగేశ్వరరెడ్డి, సంఘం అధ్యక్షుడు నీలాపు వివేకానందరెడ్డి, కార్యదర్శి సత్తి రామకృష్ణారెడ్డి, నీలాపు రమణారెడ్డి, సంజీవరెడ్డి, పులగం సూర్యనారాయణరెడ్డి నివాళులు అర్పించారు.

27వ వార్డులో..

జీవీఎంసీ 27వ వార్డు నెహ్రూబజారులో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి ఈతలపాక శ్యాంప్రసాద్ ఆధ్వర్యంలో దివంగత నేత వైఎస్సార్ వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీతంరాజు సుధాకర్ పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు.

దొండపర్తి రామాలయం వీధిలో..

27వ వార్డు పరిధి దొండపర్తి రామాలయం వీధిలో వైఎస్సార్ యువసేన ఆధ్వర్యంలో వార్డు అధ్యక్షుడు నీలాపు సర్వేశ్వరరెడ్డి నేతృత్వంలో దివంగత నేత వైఎస్సార్ వర్ధంతి నిర్వహించారు. ముఖ్య అతిథిగా స్టేట్ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ బొల్లవరపు జానే వెస్లీ పాల్గొని వైఎస్సార్‌కు నివాళి అర్పించారు. మాజీ కార్పొరేటర్ పద్మనాభం అమ్మాజీ, జీవీఎంసీ కో–ఆప్షన్ సభ్యుడు మహమ్మద్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో..

నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గొంప గోవిందరాజు నేతృత్వంలో దివంగత నేత డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని శనివారం ఏయూ వైఎస్సార్ విగ్రహం వద్ద జరిపారు. పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి వజ్జిపర్తి శ్రీనివాసరావు, సేవాదళ్ కో ఆర్డినేటర్ బమ్మిడి గంగాధర్, కొణతాల శ్రీనివాస్, సుధాకర్, చిన్నబాబు, వెంకట్రావు, సీహెచ్ అప్పారావు, పరదేశి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

చీరల పంపిణీ..

నీలమ్మ వేపచెట్టు అమ్మవారి దేవస్థానం చైర్‌పర్సన్ బొర్రా విజయలక్ష్మి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో మహానేత వైఎస్సార్ వర్ధంతి నిర్వహించారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ పాల్గొని మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కళింగ వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ ప్రసాద్‌రావు, కోన శంకర్, ఆదివిష్ణురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహానేతకు ఘన నివాళి

జీవీఎంసీ 39వ వార్డులో స్వర్గీయ రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి కార్పొరేటర్ మహ్మద్ సాధిక్ నివాళులు అర్పించారు. ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్ ఇచ్చిన ఘనత రాజశేఖర్‌రెడ్డిదే అన్నారు. అనంతరం వికలాంగులు, వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు.



దొండపర్తి రామాలయం వద్ద వైఎస్సార్ వర్ధంతి నిర్వహిస్తున్న జాన్ వెస్లీ, సర్వేశ్వరరెడ్డి



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి, బొర్రా విజయలక్ష్మి



39వ వార్డులో దివంగత నేత వైఎస్సార్‌కు నివాళులు అర్పిస్తున్న సాధిక్



గాజులవీధిలో వైఎస్సార్ విగ్రహం వద్ద అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

క్లుప్తంగా

కొనసాగుతున్న శ్రావణలక్ష్మి పూజలు

దాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా నిర్వహిస్తున్న శ్రీలక్ష్మీ పూజలు శనివారం 17వ రోజుకి చేరాయి. ఉదయం 8 గంటలకు వేదమంత్రాలు, నాదస్వరాల నడుమ ప్రారంభమైన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పోస్టు ద్వారా వచ్చిన భక్తుల పేరిట పూజలు చేసి కుంకుమ, అమ్మవారి యంత్రం, ప్రసాదం పంపారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో కె. తిరుమలేశ్వర రావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

నీలమ్మ వేపచెట్టు అమ్మవారి గాజుల ప్రసాదం పంపిణీ



భక్తులకు గాజులు, పసుపుకొమ్ముల ప్రసాదం అందజేస్తున్న కొండా రాజీవ్‌గాంధీ

అల్లిపురం : శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని ఈ నెల 31వ తేదీన నీలమ్మ వేపచెట్టు అమ్మవారికి గాజుల అలంకరణ, పసుపు కొమ్ములతో విశేష పూజలు నిర్వహించారు. శనివారం భక్తులకు పూజలు చేసిన గాజులు, పసుపు కొమ్ముల ప్రసాదం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్‌గాంధీ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ కొండా రమాదేవి చేతుల మీదుగా అందజేశారు. బొర్రా విజయలక్ష్మీ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నీలమ్మ వేపచెట్టు అమ్మవారి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు కె.గంగాలక్ష్మి, కాంతం, చంద్రకళ, కొల్లి సత్యవతి, జామి జ్యోతి, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ జోసెఫ్‌లో తిజారా ఫెస్ట్



విద్యార్థులకు మెమొంటోలు అందజేస్తున్న ఉపాధ్యాయులు

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో కామర్స్, మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో శనివారం తిజారా ఫెస్ట్ ఘనంగా నిర్వహించారు. ఫెస్ట్‌ను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ, ఏవీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సింహాద్రి నాయుడు ప్రారంభించారు. విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి వారోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా యువ పారిశ్రామికవేత్తల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ జ్యోతి, పీకే జయలక్ష్మి, డాక్టర్ రజని తదితరులు పాల్గొన్నారు.

అనాథ శవానికి అంతిమ సంస్కారాలు



అనాథ శవానికి అంతిమ సంస్కారాలు చేస్తున్న మమత, మురళీ

అల్లిపురం : నిస్సహాయ స్థితిలో ఉన్న వ్యక్తిని 108 సిబ్బంది కొన్ని రోజుల క్రితం కేజీహెచ్‌లో చేర్పించారు. అతను చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. అతనికి ఎవరూ లేకపోవడంతో కేజీహెచ్ సిబ్బంది మమత చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ ఎల్లేటి మమతకు సమాచారం అందజేశారు. దీంతో ఆమె ఇండియన్ రెడ్‌క్రాస్ షెల్టర్ మేనేజర్ మురళి సహకారంతో అనాథ శవానికి చావుల మదుం స్మశాన వాటికలో శనివారం అంతిమ సంస్కారాలు చేశారు.

వైఎస్సార్ పౌష్టికాహార కిట్ల పంపిణీ



గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ పోషణ ప్లస్ కిట్లు అందిస్తున్న కార్పొరేటర్ సాధిక్

జగదాంబ : వైఎస్సార్ పౌష్టికాహార ప్లస్ కిట్లతో మహిళలు ఆరోగ్యంగా ఉంటారని జీవీఎంసీ 39వ వార్డు కార్పొరేటర్ మహ్మద్ సాధిక్ అన్నారు. శనివారం చిలకపేట అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ కిట్లు అందించారు. పారిశ్రామిక ప్రాంతాల్లో ఉండే వారికి టేక్‌హోం కింద ఇంటికే సరకులు పంపిణీ చేస్తున్నారని సాధిక్ అన్నారు. చిన్నారులు, పుట్టే బిడ్డలు రక్తహీనతతో బాధపడకుండా డ్రై రేషన్‌ను జగనన్న అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

అష్టలక్ష్మీదేవి సహిత మహాలక్ష్మికి కుంకుమార్చన



ప్రత్యేక అలంకరణలో అష్టలక్ష్మీ సహిత మహాలక్ష్మి



కుంకుమ పూజలో పాల్గొన్న భక్తులు

సీతంపేట: శ్రీవెంకట అన్నమాచార్య సేవా ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం శంకరమఠంలో అష్టలక్ష్మీదేవి సహిత మహాలక్ష్మి అమ్మవారి కుంకుమార్చన నిర్వహించారు. శ్రీరామ్ రామ్ గురూజీ పర్యవేక్షణలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఈ సందర్భంగా అన్నమాచార్య సేవా ట్రస్ట్ ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల డైరెక్టర్ కొఠారి సునీత మాట్లాడుతూ తాళ్లపాక స్వామీజీ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. రామ్ రామ్ గురూజీ మాట్లాడుతూ శ్రావణ మాసంలో ఇటువంటి పూజలు చేయడం వల్ల జనులందరూ ఆయురారోగ్యాలు, అష్ట ఐశ్వర్యాలతో ఉంటారన్నారు. ప్రతి ఒక్కరూ శ్రావణ మాసంలో ఇటువంటి పూజలు చేయాలన్నారు. కుంకుమార్చన కార్యక్రమాన్ని భక్తుల నుంచి ఎటువంటి రుసుం తీసుకోకుండా నిర్వహించిన అన్నమాచార్య ట్రస్టు సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సుమారు 500 మంది మహిళలు పాల్గొన్నారు.

సేవలకు గుర్తింపుగా జ్ఞాపికలు



జ్ఞాపిక అందిస్తున్న శంకర్ ఫౌండేషన్ మేనేజర్ రాధాకృష్ణ

జగదాంబ : నిరంతరం సేవలందిస్తున్న జీవీఎంసీ 39వ వార్డులో ఉన్న వివేకానంద స్వచ్ఛంద సంస్థ సభ్యులకు శంకర్ ఫౌండేషన్ జ్ఞాపికలు అందజేసింది. శనివారం సేవా సంస్థ సభ్యులకు శంకర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఆత్మకూరి శంకర్రావు జయంతి సందర్భంగా ఈ జ్ఞాపికలు అందించినట్టు ఫౌండేషన్ మేనేజర్ రాధాకృష్ణ తెలిపారు. ఎస్. రమ, ప్రియ, వెంకటసాయి, అక్షయ్ తదితరులు పాల్గొన్నారు.

కూలిన చెట్ల కొమ్మలు



బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో కూలిన చెట్ల కొమ్మలు

సీతమ్మధార: సీతమ్మధారలో శనివారం సాయంత్రం కురిసిన వర్షానికి పలు చెట్ల కొమ్మలు కూలిపోయాయి. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని హెచ్‌ఎండీసీ బ్యాంకు ఎదురుగా గల రోడ్డులో ఫ్లెక్సీలు చిరిగిపోయి. రాకపోకలకు పలువురు ఇబ్బంది పడ్డారు.

డయాలసిస్ రోగికి రూ.10 వేల పింఛన్



దయాలసిస్ రోగికి మంజూరైన కొత్త పింఛన్ అందజేస్తున్న సచివాలయ సెక్రటరీ శ్రీహరి, వలంటీర్

మహారాణిపేట : దయాలసిస్ రోగి కంచుబోయిన సన్యాసమ్మకు కొత్తగా మంజూరైన రూ. 10 వేల పింఛన్‌ను సచివాలయ కార్యదర్శి శ్రీహరి, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ వైస్ ప్రెసిడెంట్ కంచుబోయిన వెంకటరావు, వలంటీర్ శనివారం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటరావు మాట్లాడుతూ వైఎస్సార్ పింఛన్ కానుక పథకం ద్వారా డయాలసిస్ రోగికి రూ. 10 వేల పెన్షన్ మంజూరు చేసినందుకుగాను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు అన్నారు. ఒక పేద కుటుంబానికి రూ. 10 వేలు నెలకు పింఛను రూపంలో అందజేయడం మంచి పరిణామమన్నారు.

ప్రతి ఒక్కరు క్రమశిక్షణ అలవర్చుకోవాలి

మహారాణిపేట: ప్రతి ఒక్కరు క్రమశిక్షణ అలవర్చుకోవాలని నగర డీసీపీ నాగన్న అన్నారు. శనివారం బ్రహ్మకుమారీస్ రాజయోగ మెడిటేషన్ సెంటర్ హార్మొనీ హౌజ్ హాలులో ప్రచార యాత్ర కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. యాంటీడ్రగ్స్, యాంటీ ఆల్కహాల్ ప్రచారకులు సురేష్ బేత పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన డీసీపీ నాగన్న మాట్లాడుతూ ప్రజాపిత బ్రహ్మకుమారీస్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో యువతనే కాక అన్ని వయసుల వారిని విముక్తి చేయాలన్నారు. ఈ శుభ సంకల్పంతో ప్రచారయాత్ర ప్రారంభించడం మంచి పరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో కేజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ పద్మజ, ఆర్‌ఐవో ఆర్. సత్యనారాయణ, గీతం విశ్వవిద్యాలయం అధ్యక్షుడు ఎం.భరత్ తదితరులు పాల్గొన్నారు. ఈరోజు నుంచి రాష్ట్రంలోని నగర, పట్టణ, గ్రామాల్లో ఈ ప్రచారం ఉధృతం చేయనున్నట్లు బ్రహ్మకుమారీస్ శశిలీల తెలిపారు. కార్యక్రమానికి విచ్చేసే 200 మంది సభ్యులకు సాయంత్రం 6 వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు.

ట్రాఫిక్ రూల్స్ తప్పనిసరి



ద్విచక్ర వాహనాన్ని పరిశీలిస్తున్న ద్వారకా జోన్ ఎస్‌ఐ అప్పలరాజు

సీతమ్మధార: వాహన చోదకులందరూ ట్రాఫిక్ రూల్స్ పాటించి ప్రమాదాల నియంత్రణకు కృషి చేయాలని ద్వారకా జోన్ ఎస్‌ఐ అప్పలరాజు పిలుపునిచ్చారు. ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధి రామాటాకీస్ సమీపంలో శనివారం వాహనాల తనిఖీలు నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించేలా, హెల్మెట్ ధరించేలా వాహన చోదకుకు అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనాల నంబర్ ప్లేట్ బోర్డులపై ప్రత్యేక దృష్టి సారించారు. వాహనాల పత్రాలను పరిశీలించి, అవి లేని వారికి జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ప్రతి ఒక్క వాహనదారుడి వద్ద లైసెన్స్, సీబుక్, పొల్యూషన్ పత్రాలు కచ్చితంగా ఉండాలని, రవాణా శాఖ ఇచ్చిన నంబర్ ప్లేట్ మాత్రం ఉపయోగించాలని సూచించారు. సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేశారు.

కన్నాజీ సేవలు ప్రశంసనీయం

దాబాగార్డెన్స్ : ప్రముఖ వాద్య కారుడు, దేశ విదేశాల్లో అనేక ప్రదర్శనలిచ్చి వేలాది మంది అభిమానుల్ని సంపాదించుకున్న కన్నాజీ సంగీత రంగంలో అందించిన సేవలు ప్రశంసనీయమని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో శనివారం నిర్వహించిన కన్నాజీ సంస్మరణ సభలో పలువురు ప్రముఖులు పాల్గొని కన్నాజీకి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ సంగీత రంగంలో కన్నాజీ నగరానికి పేరు ప్రఖ్యాతులు తీసుకువచ్చారన్నారు. నీ స్నేహం పేరిట నిర్వహించిన సినీ సంగీత విభావరి ప్రేక్షకులు, కళాకారుల్ని అలరించింది. కార్యక్రమంలో సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యుడు గంట్ల శ్రీనుబాబు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు యుగంధర్, మహ్మద్‌ఖాన్, కారెం వినయ్‌ప్రకాష్, కొణతాల రాజు, చెన్నా తిరుమలరావు, యాద్‌కుమార్, మమతతో పాటు పెద్ద ఎత్తున అభిమానులు పాల్గొన్నారు.